# చిట్టిదాని బెంగ

శ్రీమతి సి. రంగనాయకమ్మ

అమ్మా, నాన్నగారు యింకా రారా? వస్తారమ్మా, అక్కడ పనులు చూసుకుని రేపువస్తారు. రేపు రేపు అని అంటావు, యింక యెప్పుడూ? పనులు అయిపోయినా గూడా రారా? నీకు మంచిగౌనులు, పళ్లు, చాకలెట్లు అన్నీ పట్టుకువస్తానని రాశారమ్మా, తప్పకుండా ఆదివారం వస్తారు. సరేనని ఆదివారంకోసం యెదురుచూస్తూ లెక్కపెడుతూ వుంటుంది, చిట్టి. సరిగ్గా ఆవాళటికి ఆదివారం నాల్గురోజులు వుంది. ఈ నాల్గురోజులూ నాన్నగారిమాట యెత్తదు అనుకొని నా హృదయంలో ఆవేదన కొంచము తగ్గించుకున్నాను.

కాని రెండునెలలు అవచ్చింది, భర్త పట్నంవెళ్లి. ఇంకా వచ్చేజాడలు కన్పించటములేదు. మనస్సులో బెంగ, దిగులు ఒకరోజుకన్న ఒకరోజు ఎక్కువయి హృదయాన్ని క్రుంగదీస్తున్నాయి. దానికి సాయంచిట్టి ఆరాటం కొంత.

తెల్లవారితే ఆదివారం. మళ్లీ చిట్టికి యేమి సమాధానం చెప్పనా అని ఆలోచిస్తూ, యేమీతోచక రేడియోపెట్టుకుని, టపావాడికోసం యెదురుచూస్తూ కుర్చీలో కూర్చున్నా. ఇంకా టయిమువుంది టపారావడానికి. నేను కుర్చీలో ఆలాగే కూర్చుండిపోయా. ఇంతట్లోకీ రేడియో-యెంత నేర్చినా, యెంతాజూచినా, యెంతావారలైనా, కాంతాదాసులే-అనే కీర్తన చక్కగా పాడుతోంది. ఆ కీర్తన సంపూర్తి అయేసరికి పోష్టువచ్చింది. అంతవరకూ యెక్కడకు వెళ్లిందో, చిట్టి పరుగెత్తుగుంటూవచ్చి, అమ్మా! నాన్నగారు వుత్తరం రాశారా? రేపు ఆదివారంగాదు. నాకు గౌనులు, చాక్లెట్లు అన్నీ తెస్తానని రాశారా అని గుక్క త్రిప్పుకోకండా, వూపిరి సలపకండా, వినేవాళ్లకు ముద్దువచ్చేలాగ అడిగేస్తోంది. టపావాడు ఒక కవరు, యేవో రెండుపేపర్లుయిచ్చి వెళ్లిపోయినాడు.

అంతక్రితం నాల్గురోజులైె భర్తదగ్గరనుంచి జాబులేదు. ఆ కవరు ఆయనరాసినదే అని గ్రహించుకుని, అందులోయేమి రాశారో అనే ఆందోళనతో ఆత్రుతగావిప్పి చూచేసరికి యేముందీ యింకా నాకుపనులు అవలేదు, కొంచము స్థిమితం చూచుకుని యెప్పుడో ఒకప్పుడు వస్తానని వుందిగాని ఫలానా అప్పుడు అనిలేదు. పైగా నీవు జాబులు రాయటం లేదు, రాయవా అనివుంది. నిజమే. నేను రాయడం మానేశాను. వారిమీద కక్ష కొద్దీగాదు, వారువుండే పరిస్థితిలో నా జాబులు బాధించవచ్చు అనే వుద్దేశ్యంతో మానాను.

కానీ చిట్టికి యేమి సమాధానం చెప్పాలో అర్థమవటం లేదు. అమ్మా నాన్నగారు రేపు వస్తాననిరాశారా అని అడిగింది. ఇది నాన్నగారు రాయలేదు, యెవ్వరో నాన్నగారికి రాశారు అని గట్టిగాకసిరాను. పాపం ఏమి అనుకుందో, ఆడుకోడానికి పక్కింటికి వెళ్లిపోయింది. ఏమి చేయను? ఎప్పుడూగూడా యిన్నిరోజులు యింటికిరాకండా వుండలేదు. అయినా అచ్చట పనులు పాడవుతాయనే వుద్దేశ్యంతో వూరుకున్నారు. వారికిమాత్రం సరదా ఉంటుందా అలా వుండడానికి? అందులో చిట్టి అంటే యెంతో ప్రేమ. నాల్గురోజులు చూడకపోతే వుండలేరుగూడా. అందుకనే దానికి నాన్నగారంటే అభిమానం యెక్కువ.

తెల్లవారింది. ఆదివారం. అమ్మా నాన్నగారు వస్తారు కదూ ఈవాళే అని అడిగి, నా సమాధానం పొందకుండానే గబగబ కాలకృత్యాలు తీర్చుకుని స్నానముచేసి చక్కటి దస్తులు ధరించి భోజనంచేసి వీధిగుమ్మంవద్ద తిష్ఠవేసింది.

నా గుండెల్లో ఒకవిధమైన భయం, ఆందోళనా, దిగులు ప్రవేశించాయి. గడియారం పదికొట్టింది. అప్పటికప్పుడే మెయిలు వెళ్లిపోయి అరగంట అవచ్చింది. పత్రికవాడు కేకలు వేస్తున్నాడు, రోడ్డుమీద. ఇంతట్లోకీ యేడుపు మొగము పెట్టుకుని—మెయిలు వెళ్లిపోయింది, నాన్నగారు రాలేదూ, ఈవేళ వస్తారని చెప్పావూ అని గట్టిగా ప్రారంభించింది యేడుపు. ఏమి చెయ్యనూ, యేమిచెప్పను? అది ఆలా యేడుస్తూంటే నాకు యేడుపువచ్చింది. ఆఖరుకు ధైర్యం

తెచ్చుకుని, మంచిమాటలాడి యెత్తుకుని, రేడియోలో పిల్లల ప్రోగ్రాం వస్తుందని చెప్పి, యెన్నిచేసినా వూరుకుం టేగా? చివరికి రెండు రూపాయలు వదిలిస్తే ఆరోజుకు వూరుకుంది. మర్నాటినుంచీ మళ్ళా యథాప్రకారం.

పోనీ, తెల్లారితే స్వాతంత్ర్యదినం గదా! ప్రపంచకం అంతటా పెద్ద పండగలా చేసుకుంటున్నారు, ఆరోజునాటి కేనా వస్తారు వారు అనుకున్నాను. నా చిట్టికి తలంటి డ్రస్సువేశాను, కాని నాహృదయం మాత్రం బాధపడు తోంది. మెయిలు వెళ్ళిపోయింది. నేను యెవ్వరికోసం యెదురు చూశానో ఆశగా, నా ఆశ నిరాశఅయి హృదయం క్రుంగిపోయింది. ఇందుకేనా తల్లిదండ్రులు నా జీవితం ఒక యువకునికి ధారవోసి, అస్వతంత్రురాలుగా జేశారు? అందుచేత స్వాతంత్ర్యదినం అనే వుత్సాహం, ఆనందం, సంతోషం యేదీగూడా నా మనస్సుకు తోచలేదు. స్వాతం త్ర్యదినం అనే భావమే తోచలేదు. నా జీవితాంతం వరకు పరాధీనురాలిని, అస్వతంత్రురాలినీ గనుక ఆరోజున జరిగిన వేడుకలూ, ఆనందాలూ నాకు యేమీ గోచరించలేదు.

నా చిట్టి వూరుకుంటుందా అనుకున్నాను. అది సంపూర్ణ మైన స్వాతంత్ర్యజీవి, స్వేచ్ఛాజీవిగనుక దాని ఆనందం, సంతోషం చెప్పడానికి, రాయడానికి అలవికాదు. ఆమూడు రోజులూ రేడియోలో మంచి ప్రోగ్రాములు వుండడముచేత చాలమంది స్త్రీలతోటి, బాలబాలికలతోటి హడావిడిగా గడిపింది, చిట్టి. నాకుమాత్రం దిగులు తప్పలేదు.

మళ్లీ మొదలు చిట్టి-నాన్నగారు వస్తారు, వస్తారు అన్నావు. రాలేదు. నిన్న జెండాపండగ. వాళ్ల పెద్దన్నయ్య చిన్నన్నయ్య జెండాపండగ అని వచ్చారు, వాళ్ల యిం టికి. మా నాన్నగారుపండక్కి-గూడా రాలేదు, వస్తారని చెప్పావు నువ్వు. నీవి అన్నీ అబద్ధాలే. రేపు నాన్నగారు రాకపోతే, నేను గోదావరిలోపడి చచ్చిపోతాలే అని యేడ వడం మొదలు పెట్టింది.

రేపు తప్పక వస్తారమ్మా, అలా అనకూడదూ అని చెప్పే లోపుగా పాలకోవా, కేకులు కేక వినబడింది. అవికొన మంది. సరేనని రెండురూపాయలు వాడికి సమర్పించుకుని ఆయేడ్పు తగ్గించే సరికి చచ్చి బతికినంత పని అయింది. సరేనయ్యా, తెల్లవారింది. మళ్లీ యథాప్రకారం యీ రోజూ గట్టి పట్టే పట్టింది. అన్నం తిననని భీష్మించుకొని గుమ్మానికడ్డంగా కూర్చుంది. మెయిల్ వచ్చింది. కాస్సే పటికి జట్కా వచ్చి ఆగింది, గుమ్మంవద్ద. ఇంక దాని సంతోషం చెప్పలేను. ఇంతకీ చూస్తే ఒక అబ్బాయి ట్రంకు, బెడ్డింగు దింపి బండిని పంపించేశాడు. మా నాన్న గారు యేరి అని అడిగిందిట ఆ కుర్రాణ్ణి. మీ నాన్న గారు బెజవాడలోదిగారు, రాత్రికి వస్తారు అని చెప్పి ఏదో పళ్లబుట్ట యిచ్చాడుట. గబగబవచ్చి-అమ్మా! నాన్న గారు యిన్నాళ్లయినా తిన్నగా యింటికిరాక మధ్యగా బెజవాడలో దిగారుట, ఆ అబ్బాయి చెప్పాడు అని ఆ అరటిపళ్లలో ఒకటితిని యింకా తనకోసమేమన్నా తెచ్చా రేమోనని హడావిడిగా ఆ పెట్టె బెడ్డింగు వెతికేసింది. ఏమీ కనిపించలేదు. పాపం బిక్కమొగంతో నాన్న గారు యేమీ తెచ్చిపెట్టలేదు అంది. రాత్రి 12 గంllకు వచ్చారు. అప్పుడు లేచి దగ్గరకు వెళ్లింది. సంతోషంగా వుంది చిట్టికి. ఇప్పటికీ, నీవన్నీ అబద్ధాలే అని దెప్పుతూ వుంటుంది, అమ్మను. పిల్లలుచేసే చర్యలు తల్లులకేగాని తండ్రులకు తెలియవు.

